సాక్షి తిరుపతి
బుధవారం । 14 । జూన్ । 2023



అంకితభావంతో అభివృద్ధి
పాకాల మండలాన్ని అంకిత భావంతో అభివృద్ధి చేస్తామని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. - 8లో



గాలివాన బీభత్సం
వరదయ్యపాళెం మండలంలోని చిన్నపాండూరు పరిసర ప్రాంతాల్లో మంగళవారం గాలి వాన బీభత్సం సృష్టించింది. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	41	28
చిత్తూరు	39	27
తిరుమల	36	24
గూడూరు	42	31
నగరి	41	28

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 79,087 మంది స్వామివారిని దర్శించుకోగా.. 35,640 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.41 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శిల్పకళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్: టీటీడీ శ్రీవేంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాలలో-2023-24 విద్యాసంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పీఆర్వో టీ.రవి పేర్కొన్నారు. కళాశాలలో జూలై 10వ తేదీ వరకు దరఖాస్తులు పొందవచ్చని, పూర్తిచేసిన దరఖాస్తులను జూలై 15వ తేదీ సాయంత్రంలోపు కళాశాలలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. నాలుగేళ్ల డిప్లొమా, రెండేళ్ల సర్టిఫికెట్ కోర్సుల్లో చేరదలిచిన విద్యార్థులు కోర్సుల విద్యార్హతలు, ఇతర వివరాల కోసం www.tirumala.orf వెబ్‌సైట్‌ను, లేదా, కళాశాల కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 0877-2264637, 9866997290లో సంప్రదించాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: అలిపిరి డిపోలోని ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 21వ బ్యాచ్‌కి బుధవారం వీడ్కోలు పలకనున్నారు. ఇప్పటి వరకు డ్రైవింగ్ స్కూల్‌లో 336 మంది శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరిలో 50శాతం మందికి ఆర్టీసీలోనే ఉద్యోగ అవకాశాలు లభించాయి. మరోవైపు 23వ బ్యాచ్‌కి బుధవారం నుంచే దరకాస్తులు స్వీకరించనున్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని సంబంధిత అధికారులు సూచించారు.

నేడు రక్తదాన శిబిరం

తిరుమల: ప్రపంచ రక్త దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తిరుమల అశ్విని ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుసుమకుమారి తెలిపారు. దాతలు బుధవారం ఉదయం 9 గంటల నుంచి రక్తం ఇవ్వవచ్చని ఆమె సూచించారు.

80.65 శాతం మంది ఉత్తీర్ణత

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రథమ, ద్వితీయ పరీక్షా ఫలితాలు మంగళవారం సాయంత్రం వెల్లడయ్యాయి. గత నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 122 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 42,201 మంది హాజరవ్వగా వారిలో 31,380 (74.36 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సర పరీక్షకు 35,613 మంది హాజరవ్వగా వారిలో 28,721 (80.65శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్ఐఓ రమేష్ తెలిపారు.

శ్రీసిటీ ఐలాకు అంబులెన్స్ వితరణ



అంబులెన్స్ తాళాలను ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు అందజేస్తున్న ఐఎంపీపీ పరిశ్రమ ఎండీ తైజో ఇవామి

వరదయ్యపాళెం: శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ (ఐఎంపీపీ) పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా)కు రూ.29 లక్షల విలువైన నూతన అంబులెన్స్ వాహనాన్ని వితరణగా అందజేసింది. మంగళవారం పరిశ్రమ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కంపెనీ ఎండీ తైజో ఇవామి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్‌కు అంబులెన్స్ తాళాలను అందజేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవ సూచనల మేరకు ఈ ప్రాంతంలో ఆరోగ్య, సామాజిక, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి తమవంతు బాధ్యతగా సీఎస్ఆర్ చర్యలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తైజో ఇవామి పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీకి సేవలందించడానికి ఈ అంబులెన్స్ వినియోగించనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఐఎంపీపీ యజమాన్యానికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, సెక్యూరిటీ హెడ్ వై.రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకం లేదా బాబు!

ప్రజలను నమ్మించడం.. తర్వాత గెలుపొందడం.. ఆపై వెన్నుపోటు పొడవడం.. చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య. అహర్నిశలు శ్రమించే కార్యకర్తలనైనా కరివేపాకులా తీసేయడం ఆయన అలవాటు. ఇలాంటిదే కుప్పంలోనూ చోటు చేసుకుంది. ఇన్నాళ్లూ తన గెలుపునకు కష్టపడిన వారిని పక్కనబెట్టి ఇటీవల గెలుపొందిన ఎమ్మెల్సీకి కుప్పం బాధ్యతలు అప్పగించడంపై తమ్ముళ్లు గుర్రుమంటున్నారు. తమపై నమ్మకం లేక పక్క జిల్లా వాళ్లను ఇన్‌చార్జ్‌గా నియమించారని చెవులు కొరుక్కుంటున్నారు. అసంతృప్తులను బుజ్జగించేందుకే ఆయన కుప్పంలో మూడు రోజుల పాటు పర్యటించనున్నట్టు ఆ పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు.



- స్థానిక నేతలను కాదని ఎమ్మెల్సీకి కుప్పం బాధ్యతలు
- అసంతృప్తులను బుజ్జగించేందుకు కుప్పం రానున్న చంద్రబాబు
- మూడు రోజులు కార్యకర్తలతో వరుస సమావేశాలు!
- వైఎస్సార్‌సీపీ నాయకులు చేరుతున్నారంటూ విషప్రచారానికి స్కెచ్
- రెచ్చగొట్టి.. చిచ్చుపెట్టేందుకు రెడీ!

సాక్షి, తిరుపతి: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతి ఒక్కరినీ తన కోసం వాడుకుని వదిలేసే రకం అని మరోసారి రుజువు చేసుకున్నారు. కుప్పం నియోజకవర్గంలో మొదటి నుంచి చంద్రబాబు గెలుపు కోసం అహర్నిశలు పనిచేస్తున్న నాయకులను పక్కనబెట్టి.. ఇతర జిల్లా నివాసి, ప్రస్తుత ఎమ్మెల్సీకి కుప్పం బాధ్యతలు అప్పగించనున్నారు. ఎమ్మెల్సీ చెప్పినట్లు ప్రతిఒక్కరూ వినాలని చెప్పి ఒప్పించేందుకు చంద్రబాబు కుప్పం పర్యటనకు వస్తున్నారు. అందులో భాగంగానే మూడు రోజుల పర్యటనలో కేవలం ఒకే ఒక బహిరంగ సభ మాత్రం ఏర్పాటు చేసి.. మిగిలిన సమయం అంతా గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులతో విడివిడిగా సమావేశం కానున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులంతా చంద్రబాబు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం చంద్రగిరిలో ఓటమి పాలైన తర్వాత 1989లో కుప్పంకు వలస వెళ్లారు. అప్పటి నుంచి మొన్నటి వరకు ఎన్నికల నామినేషన్‌కు వచ్చినా.. రాకపోయినా, ప్రచారం చేసినా.. చేయకపోయినా కుప్పంకు చెందిన నాయకులే అహర్నిశలు కష్టపడి గెలిపించారు.

ఆ ఓటమిని స్థానిక నేతలపై రుద్దే ఉద్దేశం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలకు జనం ఆకర్షితులయ్యారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నా చేయలేని పనులు ఈ నాలుగేళ్లలో చేసి చూపించారు. దీంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు నమ్మకం పెంచుకున్నారు. అందులో భాగంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీని మట్టికరిపించారు. చంద్రబాబుని నమ్మని కుప్పం ప్రజలు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పట్టారు. ఈ ఘోర పరిణామాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు స్థానిక సంస్థల ఓటమిని కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలపై మోపి చేతులు దులుపుకున్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన కంచర్ల శ్రీకాంత్‌కు కుప్పం నియోజకవర్గ పూర్తి బాధ్యతలు అప్పగించారు. స్థానిక నాయకులందరినీ కరివేపాకులా తీసిపడేశారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపట్ల అసంతృప్తిగా ఉన్న కుప్పం టీడీపీ నేతలను నయానో, భయానో ఒప్పించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే బుధ, గుర, శుక్రవారాల్లో కుప్పంలోనే మకాం వేయనున్నారు. ఈ మూడు రోజుల్లో గురువారం మాత్రమే బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. మిగిలిన సమయం అంతా కుప్పంలోని బీసీఎన్ కల్యాణ మండంలో నాయకులు, కార్యకర్తలతో వరుస సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశం ముఖ్యఉద్దేశ్యం.. కుప్పం నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులంతా ఎమ్మెల్సీ చెప్పినట్లు నడుచుకోవాలని చంద్రబాబు హుకుం జారీచేయడమేనని స్థానికులు చెవులు కొరుక్కుంటున్నారు. బాబు నిర్ణయం పట్ల కుప్పం టీడీపీ శ్రేణుల్లో మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

నమ్మించడానికి రెడీ!

చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి భారీ చేరికలు ఉంటాయని జోరుగా ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని టీడీపీ శ్రేణులను నమ్మించారు. అందుకు అనుగుణంగా సాధారణ జనాన్ని పిలిపించుకుని టీడీపీ కండువాలు వేసి వారంతా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అని ఎల్లోమీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మరో వైపు వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టి గొడవలు సృష్టించి, ఆపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లేందుకు కుట్రలు పన్నినట్లు టీడీపీ సర్కిల్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

కుప్పం నుంచే ఎన్నికలకు పిలుపునిస్తారా?

మరో వైపు 2024 ఎన్నికలకు చంద్రబాబు కుప్పం నుంచే పిలుపు ఇవ్వనున్నట్లు టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉచిత విద్యుత్ హామీని కుప్పంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అదే తరహాలో చంద్రబాబు కుప్పంలో కొత్తగా హామీలను ప్రకటించనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇంకా.. రాష్ట్రస్థాయి నాయకులను కుప్పానికి రమ్మని సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. వారందరి సమక్షంలో కొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకుంటారని టీడీపీ శ్రేణులు చెబుతున్నారు.

కరెన్సీ గంగమ్మా.. కాపాడమ్మా!



కరెన్సీ నోట్ల అలంకరణతో గంగమ్మతల్లి

తిరుపతి కల్చరల్: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ కరెన్సీ అలంకరణలో భక్తులను కటాక్షించారు. గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గంగజాతర తర్వాత వచ్చిన నాల్గవ మంగళవారం కావడంతో భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం కిక్కిరిసింది. ఉదయం మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం.. అనంతరం వివిధ కరెన్సీ నోట్లతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. జాతర వేషాలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రంగస్థలి కళాకారులు శ్రీకృష్ణుడుగా శ్రీకృష్ణదేవరాయలు, భీముడు, తెనాలిరామకృష్ణుడు, హరిశ్చంద్ర, అర్జునుడు, బలరామకృష్ణుడు వంటి పౌరాణిక వేషధారణలో ఆకట్టుకున్నారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు ప్రసాదాలు వితరణ చేశారు.



ఆలయానికి పోటెత్తిన భక్తులు

వైభవంగా వకుళమాత ఆలయ వార్షికోత్సవం

- ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు



అమ్మకు బంగారు కానుకలను పంపించిన శ్రీవేంకటేశ్వరుడు



అమ్మవారికి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, పేరూరు బండ (పాతకాల్వ)పై నిర్మించిన శ్రీ వకుళమాత ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం పుణ్యాహవచనం, కలశ స్థాపన, కలశ పూజ, విశ్వక్షేనారాధన జరిపారు. అనంతరం సంకల్ప పూజ, అగ్ని ప్రతిష్ట, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, అష్టోత్తర శత కలశ స్నపనం నిర్వహించారు. ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, సీతారామాచార్యులు నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్ దంపతులు, జేఈవో వీరబ్రహ్మం, ఆర్డీవో కనక నరసారెడ్డి, ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

అమ్మకు వెంకన్న కానుక

వకుళ మాత ఆలయ తొలి వార్షికోత్సవం సందర్భంగా తిరుమల నుంచి ఆమె కుమారుడు వేంకటేశ్వర స్వామి 160 గ్రాముల బరువైన రెండు బంగారు హారాలు కానుకగా పంపారు. శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం ఈ ఆభరణాలను తీసుకువచ్చి జేఈవో వీరబ్రహ్మంకు అందజేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా జేఈవో ఈ ఆభరణాలను ఆలయానికి అందించారు. మంత్రి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి వకుళ మాత చిత్రపటాలను ఆవిష్కరించారు.

మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు ఆలయ ఎదుట విలేకరులతో మాట్లాడారు. ఘనమైన చరిత్ర కలిగిన వకుళమాత జీర్ణోద్ధరణ కార్యక్రమం చేయడం, తొలి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే భక్తులకు టీటీడీ మెరుగైన వసతులను కల్పించిందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతామని మంత్రి వివరించారు.

శయనించు తల్లీ!



శయనసేవలో పవళించిన చెంగాళమ్మ తల్లి



శయనసేవలో గ్రామ ఊరేగింపునకు బయలుదేరిన చెంగాళమ్మ తల్లి

సూళ్లూరుపేట: శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారికి శయనోత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. శనివారం రాత్రి మహిషాసురమర్దనంలో మహిషాసురుడితో యుద్ధం చేసిన అమ్మవారు సోమవారం రాత్రి తెప్పోత్సవంలో తరించారు. తర్వాత అమ్మవారికి విశ్రాంతి అవసరం కాబట్టి మంగళవారం రాత్రి శయనోత్సవాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో దీన్నే శయనసేవగా పిలుస్తుంటారు. అదేవిధంగా శయనసేవపై పవళించిన అమ్మవారు గ్రామోత్సవంలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చెంగాళమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు పుష్పపల్లకీ సేవ

బ్రహ్మోత్సవాల్లో ఆఖరురోజున బుధవారం పుష్పపల్లకీ సేవ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. గ్రామోత్సవం కూడా శయనసేవతో ముగుస్తుంది. బుధవారం రాత్రి నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో ''వీరసింహారెడ్డి'' సినిమా హీరోయిన్ హనీరోజ్ విచ్చేసి అలరించనున్నారు.

ఘాట్ రోడ్‌లో ప్రమాదాలు నివారిద్దాం

- ప్రతి మలుపు వద్ద సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు
- జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, హాజరైన అధికారులు

తిరుపతి క్రైం : తిరుమల ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తిరుమల తిరుపతి ట్రాఫిక్ అధికారులతో ఎస్పీ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తిరుమల ఘాట్ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మలుపు వద్ద సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు నియంత్రించొచ్చని చెప్పారు. ముఖ్యంగా తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులో బ్రేక్ డ్రమ్ములు ఒత్తిడికి గురై పూర్తిస్థాయిలో బ్రేకులు పడనందున కొంతమేర ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. టీటీడీ ఉన్నతాధికారులతో పూర్తిస్థాయిలో చర్చలు జరిపి ఘాట్ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు మరిన్ని చర్యలు చేపడతామన్నారు. ఘాట్ రోడ్డులో ఏదైనా అత్యవసరమైతే 0877-2263333 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఓవర్ స్పీడ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడితే వాహనం సీజ్

బుధవారం నుంచి ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, మద్యం సేవించి నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. నగరంలో ట్రాఫిక్ నిబంధన పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు వెల్లడించారు. జాతీయ రహదారుల వెంబడి రాత్రి వేళల్లో స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేస్తామన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి అవసరమైన చోట రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌సీ రోడ్, అవిలాల, 150 అడుగుల బైపాస్ రోడ్డు, రామానుజ సర్కిల్ ప్రాంతంలో, తనపల్లి క్రాస్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై యువత ట్రాఫిక్ నిబంధన అతిక్రమిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్ విమలకుమారి, మునిరామయ్య, డీఎస్పీలు నరసప్ప, కొండయ్య, సీఐలు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఐకి బెయిలబుల్ వారెంట్

తిరుపతి లీగల్ : రెండు క్రిమినల్ కేసుల్లో సాక్షిగా ఉండి సాక్ష్యం చెప్పడానికి కోర్టుకు హాజరుకాని సీఐ జి.అశోక్‌కుమార్‌కు తిరుపతి 5వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి సరిత మంగళవారం బెయిలబుల్ వారెంట్ జారీచేశారు. వివరాల్లోకి వెళితే.. 2019 ఏప్రిల్ 19వ తేదీ అవిలాల గ్రామ రెవెన్యూ లెక్కదాఖల సర్వే నంబరు 360 వినాయక నగర్‌లో ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని, ఆ స్థలాన్ని ఖాళీచేసి వెళ్లాలని తిరుపతి రూరల్ అప్పటి ఆర్ఐ పి.దిలీప్ కోరారు. దీనిపై వారు అతని విధులు అడ్డుకొని దుర్భాషలాడారు. దీనిపై ఆర్ఐ ఫిర్యాదుమేరకు తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పటి సీఐగా ఉన్న అశోక్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. అదే విధంగా మరో కేసును సీఐ అశోక్‌కుమార్ నమోదు చేసి దర్యాప్తు అధికారిగా ఉన్నారు. రెండు కేసులూ కోర్టులో విచారణకు వచ్చాయి. కోర్టు నుంచి సాక్ష్యం చెప్పాలని సీఐ అశోక్‌కుమార్‌కు సమున్లు వెళ్లినా అతను కోర్టుకు రెండు కేసుల్లోనూ హాజరుకాలేదు. దీంతో న్యాయమూర్తి సీఐ అశోక్‌కుమార్‌ను బెయిలబుల్ వారెంట్‌పై హాజరుపరచాలని తిరుచానూరు పోలీసులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సీఐ అశోక్‌కుమార్ ఇదివరలో తిరుపతి సీఐడీలో విధులు నిర్వహిస్తూ ఏడాదికి పైగా సెలవుపై వెళ్లినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు

రేణిగుంట: రేణిగుంట–శ్రీకాళహస్తి మార్గంలోని గురవరాజుపల్లి క్రాస్ రామకృష్ణాపురం వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు పట్టణ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టకు చెందిన సుందరరావు కుమారుడు కల్యాణ్(23) రేణిగుంట నుంచి శ్రీకాళహస్తి వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, ఎదురుగా వస్తున్న వెంకటగిరి డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి వైద్య కళాశాలకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంకితభావంతో అభివృద్ధి

- రోల్ మోడల్‌గా పాకాల పంచాయతీ
- రూ.4.5 కోట్లతో అభివృద్ధి పనులు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- గడప గడపకు మహా పాదయాత్రకు బ్రహ్మరథం



మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న జెడ్పీటీసీ నంగా పద్మజాబాబురెడ్డి



మంగళహారతులు పడుతున్న మహిళలు

పాకాల: చంద్రగిరి నియోజకవర్గంలోనే పాకాల మండలం ప్రత్యేక స్థానం సంతరించుకుంది. అంకిత భావంతో మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. పాకాల–1 సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా హారతులు పట్టి ఆహ్వానం పలికారు. తమ కుటుంబ సభ్యుడిగా ఆదరించారు. అంతకుముందు శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామిని మోహిత్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం సత్తెమ్మ ఆలయానికి చేరుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి గడపగడపకు పర్యటించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు వెంట నడవగా పాకాల–1 పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీ పరిధిలో న్యూకాలనీ, పార్కువీధి, మొయిన్‌రోడ్డు, ఆంజనేయస్వామి వీధి, రామానాయుడు కాలనీ, కమ్మవీధి, సత్తెమ్మ గుడి వీధి, కమతంపల్లి, బజారువీధి, అరుణానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. గడపగడపలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల జాబితాను అర్హులకు అందజేశారు.

రోల్ మోడల్‌గా పాకాల పంచాయతీ

మేజర్ పంచాయతీ పాకాల–1 మండలంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టామన్నారు. 2021 జూన్‌లో తుడా పరిధిలోకి చేరడంతో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. ఈ మూడేళ్లలో రూ.3 కోట్ల నిధులతో పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.1.50 కోట్లతో గ్రామ సచివాలయ భవనంతో పాటు బోర్లు, పైపు లైన్ల ఏర్పాటు చేశామన్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.

సన్మానాలు, సత్కారాలు

జెడ్పీటీసీ నంగా పద్మజాబాబురెడ్డి తన అనుచరులతో తరలివచ్చి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించారు. దుశ్శాలువలతో సత్కరించారు. అంతకుముందు మండల పార్టీ నాయకులు భారీ బాణసంచా పేలుళ్లతో ఘనంగా స్వాగతించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రతి ఇంటా శీతల పానీయాలు అందిస్తూ మోహిత్‌రెడ్డి పట్ల ఆత్మీయతను కనబరిచారు. ఎంపీపీ లోకనాథం, మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, నంగా బాబురెడ్డి, సర్పంచ్ కస్తూరి, పార్టీ డివిజన్ అధ్యక్షులు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, గుండ్లూరిసురేష్, యువజన నాయకులు యుగందర్ (చంటి), తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ మాలతి పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,690
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,540
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,400
రిటైల్ వెండి గ్రాము	రూ.77.40

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

భాకరాపేట : భాకరాపేట ఘాట్ రోడ్డులో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కథనం .. విజయ్‌కుమార్, బాలాజీ మంగళవారం భాకరాపేట నుంచి తిరుపతికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. ఘాట్ రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో తిరుపతి నుంచి భాకరాపేట వైపు వస్తున్న కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. విజయ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంలో చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతదేహం లభ్యం



మీరాంబీ(ఫైల్)

సైదాపురం/రాపూరు : దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో తెలుగుగంగ ప్రధాన కాల్వలో పడి గల్లంతైన మీరాంబీని (35) మంగళవారం గజ ఈతగాళ్లు బయటకు తీశారు. అలాగే కాల్వలోనే ఉన్న ఆటోను కూడా బయటకు తీశారు. స్థానికులు, పోలీసులు అందించిన వివరాల మేరకు.. సైదాపురం మండలం, కలిచేడు గ్రామానికి చెందిన చాగణం మస్తాన్ తన భార్య మీరాంబీతో కలిసి సొంత ఆటోలో డక్కిలి మండలం, దేవుడు వెల్లంపల్లి గ్రామంలో ఉన్న ఈశ్వరయ్యస్వామి గుడికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి గంగ కాల్వలో పడిపోయారు. ఈ ప్రమాదం నుంచి భర్త మస్తాన్ క్షేమంగా బయటపడ్డాడు. భార్య గల్లంతవగా.. ఆటో కూడా కొట్టుకుపోయింది. సోమవారం రాత్రి చీకటి పడడంతో వెదికేందుకు కష్టమైంది. మంగళవారం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆటోలో ఇరుక్కుపోయిన మీరాంబీ(36)ని బయటకు తీశారు. కేసును నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రాపూరు సీఐ కోటేశ్వరరావు తెలిపారు.



మీరాంబీ మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఈతగాళ్లు

పాదయాత్ర కాదు ఫొటో యాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

తిరుపతి కల్చరల్: పాదయాత్రను ఫొటో షూట్ లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి నారా లోకేష్ దిగజార్చారని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఎద్దేవా చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. యువగళం పేరును విద్వేషగళంగా మార్చితే సబబుగా ఉంటుందని సూచించారు. పాదయాత్ర ద్వారా ప్రజల కష్టనష్టాలు తెలుసుకొని సద్విమర్శలు చేయాలి తప్ప బూతు గొంతుకగా మార్చడం విడ్డూరంగా ఉందన్నారు. లోకేష్ పాదయాత్రకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి సహకరిస్తున్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లడం భావ్యం కాదన్నారు.

జూడో రాష్ట్ర చాంపియన్ షిప్ ట్రోఫీల ఆవిష్కరణ



జూడో చాంపియన్ షిప్–2023 ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న దివాకర్‌రెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఈ నెల 17నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఓపెన్ క్యాడెట్ జూడో చాంపియన్‌షిప్–2023 ట్రోఫీలను మంగళవారం డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్‌రెడ్డి, జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు రాజేష్, ఉపాధ్యక్షుడు భానుప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్న జిల్లా జట్టు చాంపియన్‌గా నిలవాలని దివాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ పోటీలను రాష్ట్ర జూడో సంఘం అధ్యక్షుడు ఆనం రామకిశోర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బద్దుల శ్రీధర్, సీఈఓ కేఎన్.బాబు, గౌరవాధ్యక్షులు రాంబాబు, టెక్నికల్ చైర్మన్ జయసింహ సమక్షంలో నిర్వహించనున్నట్లు కిరణ్‌కుమార్ తెలిపారు.

గాలివాన బీభత్సం



సత్యవేడు- కదూరు ప్రధాన రోడ్డు మార్గంలో..

వరదయ్యపాళెం: మండలంలోని చిన్నపాండూరు పరిసర ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. కదూరు–సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలోని యానాదివెట్టు వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. ఆ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి, ఏఎస్ఐ షణ్ముగం సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంలో చెట్టును తొలగించారు. వాహన రాకపోకలను పునరుద్ధరించారు. యానాదివెట్టు హరిజవాడలో కరెంటు తీగలపై చెట్టు కూలడంతో అవి తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న దృశ్యం

ఏర్పేడు: సూప్ ఎకో యాప్ కోసం ఒప్పందం జరిగినట్లు ఐసర్ డైరెక్టర్ శాంతన భట్టాచార్య తెలిపారు. మంగళవారం జంగాలపల్లి రెవెన్యూలోని ఐసర్ ప్రాంగణంలో సూప్ ఎకో యాప్ సీఈఓ శ్రేయష్ రెడ్డితో ఎంఓయూపై సంతకాలు చేసినట్లు వివరించారు. ఈ యాప్ పరిశోధకుల ఆచరణాత్మక అనుభవాన్ని పొందడానికి, వాస్తవ ప్రాజెక్ట్‌లకు సహకరించడానికి, పర్యావరణ సవాళ్లను పరిష్కరించడానికి దోహదపడుతుందన్నారు. ఐసర్ రిజిస్ట్రార్ సీపీ మోహన్‌కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లి పాల్గొన్నారు.

పక్కా..'పొదుపు' లెక్క!

దేశంలోని స్వయం సహాయక సంఘాలను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్‌ను ప్రవేశపెట్టింది. పొదుపు సంఘాల్లోని మహిళల వివరాలను పకడ్బందీగా నమోదు చేస్తోంది. ఈ వినూత్న కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే శ్రీకారం చుట్టింది. ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపుల సమగ్ర సమాచారాన్ని శరవేగంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టింది. మొత్తం ప్రక్రియ పూర్తయితే సభ్యులు సులువుగా తమ సంఘాల ఆర్థిక లావాదేవీలను తెలుసుకునే వెసులుబాటు కల్పిస్తోంది.

- స్వయం సహాయక సంఘాల వివరాలకు లోకోస్ యాప్
- మరింత పారదర్శకంగా సభ్యుల లావాదేవీలు
- పైలెట్ ప్రాజెక్టుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా
- శరవేగంగా సాగుతున్న ఆన్‌లైన్ నమోదు



లోకోస్ యాప్‌పై డ్వాక్రా ఏపీఎంలు, సీసీలు, సంఘమిత్రలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం (ఫైల్)



గ్రూపు మహిళలు

పలమనేరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 35,365 ఎస్‌హెచ్‌జీలు ఉన్నాయి. మొత్తం 3,69,896 మంది సభ్యులున్నారు. ఇప్పటిదాకా సంఘ లావాదేవీలు, ఆర్థిక స్థితిగతులను మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా నిర్వహించేవారు. 2019లో ఢిల్లీకి చెందిన ఎన్ఆర్ఎల్ఎం ప్రత్యేక బృందం చంద్రగిరి మండలంలో మొబైల్ బుక్ కీపింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. దీనిపై అధ్యయనం చేసి దీన్ని మరింతగా మెరుగుపరిచి లోకోస్ యాప్‌ను తీసుకువచ్చింది. లోక్ అంటే ప్రజలు ఓఎస్ అంటే ఆపరేటింగ్ సిస్టంగా దీనికి పేరు పెట్టారు. ఈ యాప్‌ను పకడ్బందీ అమలు చేసేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 18మంది డీఆర్‌డీఏ అధికారులను ఎంపిక చేసి వారికి ఢిల్లీలో ప్రత్యేకంగా శిక్షణనిచ్చారు. ఆపై వీరు మండల స్థాయిలో ఏపీఎంలు, సీసీలకు లోకోస్ యాప్‌పై అవగాహన కల్పించారు. వీరు క్షేత్రస్థాయిలో వీఓల ద్వారా పొదుపు సంఘాల వివరాలను అప్‌లోడ్ చేయిస్తున్నారు.

క్షణాల్లో సమాచారం

గతంలో ఒక సంఘానికి సంబంధించిన వివరాలు వారికి మాత్రమే తెలిసేవి. తర్వాత గ్రామ సమాఖ్య ద్వారా మండల, జిల్లా సమాఖ్యకు చేరేవి. ప్రస్తుతం మహిళాసంఘాలు మరింత చైతన్యవంతమయ్యాయి. చాలా మంది రుణాలు తీసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో డిజిటలైజేషన్ ప్రక్రియ ఊపందుకుంటోంది. దీంతో పేపర్‌లెస్ విధానం అమలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో లోకోస్ యాప్ మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ యాప్ ద్వారా దేశంలోని ఏ సంఘం ఆర్థిక వివరాలనైనా ఎక్కడి నుంచైనా క్షణాల్లో తెలుసుకోవచ్చు. సంఘం ఎప్పుడు ప్రారంభమైంది. సభ్యుల వివరాలు, వారు తీసుకున్న రుణం, చెల్లించిన మొత్తం, బ్యాలెన్స్, పావలా వడ్డీ, వడ్డీ మాఫీ తదితర సమాచారం పారదర్శకంగా అందుబాటులోకి వస్తుంది. సంఘం సభ్యులే కాదు కుటుంబీకులు సైతం ఈ వివరాలను చూసుకోవచ్చు.

లావాదేవీలు పారదర్శకం



లోకోస్ యాప్‌తో సంఘం లావాదేవీలు మరింత పారదర్శకం కానున్నాయి. ఇప్పటికే సంబంధిత మండలాల ఏసీలు, ఏపీఎంలకు యాప్‌పై శిక్షణ ఇచ్చాం. గ్రూపు వివరాల క్రోడీకరణ చురుగ్గా సాగుతోంది. యాప్‌లో చూసి ఆయా సంఘ లావాదేవీలు, రుణాలు, రికవరీ, బెనిఫిట్స్ ఇలా మొత్తం సమాచారాన్ని క్షణాల్లో గ్రూపు సభ్యులు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

– తులసి, డీఆర్‌డీఏ పీడీ, చిత్తూరు

పొరబాట్లకు తావుండదు



ఇప్పటివరకు సంఘం కార్యకలాపాలను పుస్తకంలో నమోదు చేసుకునేవాళ్లం. సంఘంలోని రుణాలు, చెల్లించిన అప్పు, బాకీ ఇతర వివరాలను సంఘమిత్రలు చెబితేనో.. వీఓ మీటింగ్‌లో వెల్లడిస్తేనో తెలిసేది. అయితే లోకోస్ యాప్ వచ్చిందంటే సభ్యులందరూ పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ఎలాంటి పొరబాట్లకు తావుండదు.

– కృష్ణవేణి, మండల సమాఖ్య అధ్యక్షులు, పలమనేరు

సరస్వతీ నమస్తుభ్యం!

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఆగమోక్తగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారుల చేత ఓం నమశ్శివాయ సిద్ధాయనమః అంటూ అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి వాయులింగేశ్వరుని దివ్య క్షేత్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం సంతోషకరమన్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో అక్షరాలు దిద్దించడం వల్ల ఎంతో మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తి



పూజలు చేస్తున్న వేదపండితులు, హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు



అక్షరాలు దిద్దిస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు



విద్యాసామగ్రి అందజేస్తున్న పాలక మండలి చైర్మన్, సభ్యులు